03-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - స్మృతి ద్వారా సతోప్రధానమవ్వడంతో పాటు, చదువు ద్వారా సంపాదన కూడా జమ చేసుకోవాలి. చదువుకునే సమయంలో బుద్ధి అటు - ఇటు పరుగెత్తరాదు "

**ప్రశ్న :-** డబల్ అహింసక, గుప్త యోధులైన మీకు ఏ విజయము నిశ్చితము? ఎందుకు?

**జవాబు :-** పిల్లలైన మీరు మాయ పై విజయము పొందేందుకు పురుషార్థము చేస్తున్నారు. మీ లక్ష్యము మేము రావణుని నుండి మా రాజ్యము తీసుకునే తీరుతాము,....... ఇందుకై డ్రామాలో యుక్తి కూడా రచింపబడింది. మీ విజయము నిశ్చితము. ఎందుకంటే మీ జతలో సాక్షాత్ పరమపిత పరమాత్మ ఉన్నారు. మీరు యోగబలముతో విజయము పొందుతారు. మన్మనాభవ మహామంత్రము ద్వారా మీకు రాజ్యము లభిస్తుంది. మీరు అర్థకల్పము రాజ్యము చేస్తారు.

**పాట :- మనసు అనే దర్పణములో నీ ముఖము చూచుకో ప్రాణి.... (ముఖ్‌డా దేఖ్‌లే ప్రాణీ....)**

**ఓంశాంతి.** మధురాతి మధురమైన పిల్లలు నా ముందు కూర్చున్నప్పుడు మా టీచరు సాకారులు కాదు, మమ్ములను చదివించేది జ్ఞానసాగరులైన బాబా అని భావిస్తారు. వారు మన తండ్రి అని కూడా నిశ్చయముంది. ఈ నిశ్చయముంటే చదువు పై గమనముంటుంది. విద్యార్థి తన పాఠశాలలో ఉన్నప్పుడు టీచరు గుర్తుకొస్తారు. తండ్రి గుర్తు రారు. ఎందుకంటే పాఠశాలలో కూర్చొని ఉంటారు. బాబా టీచరు కూడా అయ్యారని మీకు కూడా తెలుసు. పేరునైతే పట్టుకోరాదు కదా. మనము ఆత్మలమని, తండ్రితో వింటున్నామని గమనముంచుకోవాలి. ఇలా ఎప్పుడూ జరగనే జరగదు. సత్యయుగములో గాని, కలియుగములో గాని ఇలా జరగదు. కేవలం ఒక్కసారి మాత్రమే సంగమ యుగములోనే జరుగుతుంది. మీరు స్వయాన్ని ఆత్మగా భావిస్తారు. మన తండ్రి ఈ సమయంలో టీచరుగా ఉన్నారు. ఎందుకంటే చదివిస్తారు. రెండు పనులూ చేయాల్సి వస్తుంది. ఆత్మ శివబాబా ద్వారా చదువుకుంటుంది. ఇది చదువు, యోగము కూడా అవుతుంది. చదివేది ఆత్మ. చదివించేవారు పరమాత్మ. ఇందులో కూడా మీరు సన్ముఖంలో ఉన్నప్పుడు ఎక్కువ లాభముంటుంది. చాలామంది పిల్లలు చాలా బాగా మంచి స్మృతిలో ఉంటారు. కర్మాతీత అవస్థలోకి చేరుకుంటే, పవిత్రతా శక్తి లభించినట్లవుతుంది. శివబాబా మనలను చదివిస్తున్నారని మీకు తెలుసు. ఇది మీకు యోగమే కాక సంపాదన కూడా అవుతుంది. ఆత్మనే సతోప్రధానంగా అవ్వాలి. మీరు సతోప్రధానంగా కూడా అవుతున్నారు. ధనము కూడా తీసుకుంటున్నారు. స్వయాన్ని ఆత్మగా భావించి తీరాలి. బుద్ధి పరుగెత్తరాదు. ఇచ్చట కూర్చున్నప్పుడు మనలను శివబాబా చదివించేందుకు టీచరు రూపంలో రానే వచ్చారని బుద్ధిలో ఉండాలి. వారే జ్ఞానసాగరులు, మనలను చదివిస్తున్నారు. తండ్రిని స్మృతి చేయాలి. మనమే స్వదర్శన చక్రధారులము. అంతేకాక లైటుహౌస్‌లు(Light House) కూడా మనమే. ఒక కంటిలో శాంతిధామము, మరో కంటిలో జీవన్ముక్తి ధామము ఉంది. ఈ కనుల విషయము కాదు. ఆత్మను మూడవ నేత్రమని అంటారు. ఇప్పుడు ఆత్మలు వింటున్నాయి. శరీరము వదిలితే ఆత్మలో ఈ సంస్కారముంటుంది. ఇప్పుడు మీరు తండ్రితో యోగము చేస్తారు. సత్యయుగము నుండి మీరు

వియోగులుగా ఉండేవారు. అనగా తండ్రితో యోగము లేదు. ఇప్పుడు మీరు తండ్రి సమానంగా యోగులుగా అవుతారు. యోగము నేర్పించేవారు ఈశ్వరుడు. అందువలన వారిని యోగేశ్వరుడని అంటారు. మీరు కూడా యోగేశ్వరుని పిల్లలు. వారు యోగము చేసే పని లేదు. వారు యోగము నేర్పించే పరమపిత పరమాత్మ, మీరు ఒక్కొక్కరు కూడా యోగీశ్వరుడు, యోగీశ్వరిగా అవుతారు. తర్వాత రాజ-రాజేశ్వరిగా అవుతారు. వారు యోగము నేర్పించే ఈశ్వరుడు. స్వయం వారు నేర్చుకునేదేమీ లేదు. వారు నేర్పిస్తారు. కృష్ణుని ఆత్మనే అంతిమ జన్మలో యోగము నేర్చుకొని మళ్లీ కృష్ణునిగా అవుతుంది. అందువలన కృష్ణుని కూడా యోగీశ్వరుడని అంటారు. ఎందుకంటే అతని ఆత్మ ఇప్పుడు యోగము నేర్చుకుంటూ ఉంది. యోగీశ్వరునితో యోగము నేర్చుకొని కృష్ణుని పదవి పొందుతుంది. తండ్రి ఇతని పేరును బ్రహ్మగా మార్చారు. మొదట లౌకిక పేరు ఉండేది. తర్వాత మరజీవగా అయ్యాడు. మొదట తండ్రికి చెందినవారిగా అయ్యేది ఆత్మనే. తండ్రివారిగా అయితే మరణించారు కదా. మీరు కూడా తండ్రి ద్వారా యోగము నేర్చుకుంటారు. మీరు ఈ సంస్కారము తీసుకునే శాంతిధామంలోకి వెళ్తారు. మళ్లీ ప్రాలబ్ధపు క్రొత్త పాత్ర ఎమర్జ్ అవుతుంది. అక్కడ ఈ విషయాలు గుర్తుండవు. ఈ విషయాలు ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తున్నారు. పాత్ర ఇప్పుడు పూర్తి అవుతుంది. మళ్లీ నూతనంగా ప్రారంభమవుతుంది. క్రిందికి వెళ్లాలనే సంకల్పము కలిగినప్పుడు నేను ఇక్కడకు వస్తానని, నా వాణి మొదలవుతుందని తండ్రి చెప్తున్నారు. అక్కడ శాంతిలో ఉంటాను. మళ్లీ డ్రామానుసారము వారి(నా) పాత్ర మొదలవుతుంది. రావాలనే సంకల్పము కలుగుతుంది. మళ్లీ ఇక్కడకు వచ్చి పాత్ర చేస్తారు. నంబరువారి పురుషార్థానుసారము కల్పక్రితము వలె మీ ఆత్మలు కూడా వింటాయి. రోజురోజుకు వృద్ధి చెందుతూ ఉంటుంది. ఒక రోజు మీకు పెద్ద రాయల్ హాలు కూడా లభిస్తుంది. అందులో గొప్ప-గొప్ప వారు కూడా వస్తారు. అందరూ కలిసి కూర్చొని వింటారు. రోజులు గడిచే కొలది ధనవంతులు కూడా పేదవారిగా అవుతూ ఉంటారు. కడుపు వెన్నెముకకు తగులుకుంటుంది(ఆకలితో అలమటిస్తారు). రోకటి లావు వర్షము కురిస్తే, పొలాలు మొదలైనవన్నీ మునిగిపోతాయి. ఇటువంటి ప్రకృతి ఆపదలు రానే వస్తాయి, వినాశనమవుతుంది. వాటిని ప్రకృతి వైపరీత్యాలని అంటారు. వినాశనము తప్పకుండా జరుగుతుందని బుద్ధి చెప్తుంది. అటువైపు(విదేశాలు) కొరకు బాంబులు కూడా తయారుగా ఉన్నాయి. ఇక్కడి కొరకు ప్రకృతి ఆపదలు కూడా కాచుకొని ఉన్నాయి. ఇందులో చాలా ధైర్యము కావాలి. అంగదుని ఉదాహరణ కూడా ఉంది కదా. అంగదుని ఎవ్వరూ కదిలించలేకపోయారు. ఈ స్థితిని పక్కాగా చేసుకోవాలి - "నేను ఆత్మను" శరీర భావన నశిస్తూ ఉండాలి. సత్యయుగంలో సమయం పూర్తి అయినప్పుడు ఆటోమేటిక్‌గా ఈ శరీరము వదిలి చిన్న బిడ్డగా అవ్వాలని సాక్షాత్కారమవుతుంది. ఒక శరీరాన్ని వదిలి మరో శరీరములో ప్రవేశిస్తారు. అక్కడ శిక్షలు మొదలైనవేవీ ఉండవు. రోజులు గడిచిన కొలది మీరు దగ్గరకు వస్తూ ఉంటారు. నాలో ఉన్న పాత్ర బయటపడుతూ ఉంటుందని తండ్రి పిల్లలకు తెలుపుతూ ఉంటారు. తండ్రి పాత్ర పూర్తి అవుతూనే మీ పాత్ర కూడా సమాప్తమైపోతుంది. తర్వాత మళ్లీ సత్యయుగంలో మీ పాత్ర మొదలవుతుంది. ఇప్పుడు మీరు మీ రాజ్యము తీసుకోవాలి, ఈ డ్రామా చాలా యుక్తిగా తయారు చేయబడింది. మీరు మాయ పై విజయము పొందుతారు. అయితే ఇందుకు కూడా సమయము పడ్తుంది. ఒకవైపు వారు "మేము స్వర్గములో ఉన్నాము" అని భావిస్తారు, ఇదే స్వర్గమని అంటారు.

మరోవైపు పాటలో కూడా భారతదేశానికి పట్టిన దుర్గతిని వినిపిస్తారు. ఇది ఇంకా తమోప్రధానంగా అయిపోయిందని మీకు తెలుసు. డ్రామానుసారము తమోప్రధానం కూడా చాలా వేగంగా అవుతూ ఉంటారు. మీరిప్పుడు సతోప్రధానంగా అవుతూ ఉన్నారు. ఇప్పుడు మీరు సమీపానికి వస్తూ ఉన్నారు. చివరికి విజయము మీదే. హాహాకారాల తర్వాత జయ జయ ధ్వనులు వినిపిస్తాయి. నేతి నదులు ప్రవహిస్తాయి. అక్కడ నెయ్యి మొదలైనవి కొనే అవసరముండదు. అందరి వద్ద తమ-తమ ఫస్ట్‌క్లాస్ ఆవులుంటాయి. మీరు చాలా శ్రేష్ఠంగా అవుతారు. ప్రపంచ చరిత్ర-భూగోళాలు మళ్లీ రిపీట్ అవుతాయని మీకు తెలుసు. తండ్రి వచ్చి ప్రపంచ చరిత్రను రిపీట్ చేస్తారు. కనుక "ప్రపంచ చరిత్ర-భూగోళాలు ఎలా రిపీట్ అవుతాయో వచ్చి తెలుసుకోండి" అని కూడా బాబా వ్రాయమన్నారు. తెలివిగలవారు ఇది ఇనుప యుగమని కనుక బంగారు యుగము మళ్లీ తప్పకుండా రిపీట్ అవుతుందని అంటారు. కొంతమంది సృష్టిచక్రము లక్షల సంవత్సరములని, ఇప్పుడే ఎలా రిపీట్ అవుతుందని అంటారు. ఇక్కడ సూర్య వంశీయుల, చంద్ర వంశీయుల చరిత్ర లేనే లేదు. చివరివరకు ఈ చక్రమెలా రిపీట్ అవుతుందో, వీరి(లక్ష్మీనారాయణుల) రాజ్యము మళ్లీ ఎప్పుడొస్తుందో వారికి తెలియదు. రామరాజ్యము గురించి తెలియదు. ఇప్పుడు మీ జతలో తండ్రి ఉన్నారు. సాక్షాత్ పరమపిత పరమాత్మ అయిన తండ్రి ఎవరి వైపు ఉంటారో వారు తప్పకుండా విజయము పొందుతారు. తండ్రి ఏ విధమైన హింసా చేయించరు. ఎవరినైనా చంపడం హింస కదా. అన్నిటికంటే పెద్ద హింస కామ వికారానికి వశమై కామ ఖడ్గమును చలాయించుట. ఇప్పుడు మీరు డబల్ అహింసకులుగా అవుతున్నారు. అక్కడ అహింసో పరమో దేవీదేవతా ధర్మముంటుంది. అక్కడ యుద్ధాలూ ఉండవు, వికారాలకు వశము కూడా అవ్వరు. ఇప్పుడు మీది యోగబలము. కానీ దీనిని అర్థము చేసుకోనందున శాస్త్రాలలో దేవతల, అసురుల యుద్ధమని వ్రాసేశారు. అహింస అంటే ఏమిటో ఎవ్వరికీ తెలియదు. దీనిని గురించి మీకు మాత్రమే తెలుసు. మీరు గుప్త యోధులు. ఎవ్వరికీ తెలియనివారు కానీ మిమ్ములను గురించి అందరికీ చాలా బాగా తెలుసు. మిమ్ములను ఎవరైనా సైనికులని భావిస్తారా? మీ ద్వారా అందరికీ ' మన్మనాభవ ' సందేశము లభిస్తుంది. ఇది మహామంత్రము. మనుష్యులకు ఈ విషయాలు అర్థము కావు. సత్య-త్రేతా యుగాలలో ఇవి ఉండవు. ఈ మంత్రము ద్వారా మీరు రాజ్యము పొందుతారు. తర్వాత దీని అవసరముండదు. మనము చక్రమెలా తిరిగి వచ్చామో మీకు తెలుసు. ఇప్పుడు తండ్రి మళ్లీ మహామంత్రమునిస్తారు. మీరు మళ్లీ అర్ధకల్పము రాజ్యపాలన చేస్తారు. ఇప్పుడు మీరు దైవీగుణాలు ధారణ చేసి ఇతరులతో చేయించాలి. మీరు చార్టు ఉంచితే చాలా మజాగా(ఆనందంగా) ఉంటుందని తండ్రి సలహానిస్తారు. రిజిస్టరులో గుడ్, బెటర్, బెస్ట్ ఉంటాయి కదా. స్వయం మీరు కూడా అనుభవము చేస్తారు. కొంతమంది బాగా చదువుకుంటారు. కొంతమంది గమనముంచనందున ఫెయిల్ అవుతారు. ఇది అనంతమైన చదువు. మన తండ్రి టీచరే కాక గురువు కూడా అయ్యారు. ముగ్గురి పాత్ర కలిసే కొనసాగుతుంది. జీవించి మరణించిన వారిగా అవ్వమని ఈ తండ్రి ఒక్కరు మాత్రమే చెప్తారు. మీరు స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయండి. నేను మీ తండ్రిని, బ్రహ్మ ద్వారా రాజ్యమిస్తానని తండ్రి చెప్తున్నారు. ఇతను(బ్రహ్మ) మధ్యలో దళారి. ఇతనితో యోగము జోడించరాదు. ఇప్పుడు మీ బుద్ధి పతులకు పతి అయిన ప్రియుడైన శివునితో లగ్నమై ఉంది. ఇతని ద్వారా వారు మిమ్ములను తనవారిగా చేసుకుంటారు. స్వయాన్ని ఆత్మగా భావించి నన్ను స్మృతి చేయమని వారు చెప్తారు.

ఆత్మలమైన మనము పాత్ర పూర్తి చేశాము. ఇప్పుడు తండ్రి వద్దకు మన ఇంటికి వెళ్ళాలి. ఇప్పుడు మొత్తం సృష్టి అంతా తమోప్రధానంగా ఉంది. పంచతత్వాలు కూడా తమోప్రధానంగా ఉన్నాయి. అక్కడ అన్నీ కొత్తవిగా ఉంటాయి. ఇక్కడ వజ్ర వైఢూర్యాలేవీ లేవు. సత్యయుగంలో మళ్ళీ ఎక్కడ నుండి వస్తాయి? ఇప్పుడు ఖాళీ అయిన గనులన్నీ మళ్ళీ నిండిపోతాయి. గనుల నుండి త్రవ్వి తీసుకు వస్తారు. అన్నీ కొత్త వస్తువులే ఉంటాయి కదా. లైట్లు మొదలైనవన్నీ సహజమైనవిగా ఉంటాయి. సైన్సు ద్వారా ఇక్కడ నేర్చుకుంటూ ఉంటారు. అక్కడ ఈ సైన్సు కూడా ఉపయోగపడ్తుంది. హెలికాప్టర్ నిలబడి ఉంటుంది. బటన్ నొక్కుతూనే ఎగురుతుంది. ఎలాంటి కష్టమూ ఉండదు. అక్కడ అన్నీ ఫుల్ ప్రూఫ్‌గా ఉంటాయి, మిషన్లు ఏవీ చెడిపోవు. ఇంట్లో కూర్చొని ఒక్క సెకెండులో స్కూలుకు గాని, విహారానికి గాని వెళ్తారు. ప్రజలకు వారికంటే సాధనాలు తక్కువగా ఉంటాయి. మీ కొరకు అక్కడ సర్వ సుఖాలు ఉంటాయి. అకాలమృత్యువు ఉండదు. అందువలన పిల్లలైన మీరు ఎంత గమనముంచాలి! మాయ కూడా చాలా జోరుగా ఉంది. ఇది మాయ చూపే చివరి ఆడంబరము. యుద్ధంలో అనేకమంది మరణిస్తారు. యుద్ధము ఆగనే ఆగదు. ఈ విశాలమైన ప్రపంచమెక్కడ? చిన్న స్వర్గమెక్కడ? అక్కడ గంగ పతితపావని అని అనరు. అక్కడ భక్తిమార్గములోని విషయమేదీ ఉండదు. ఇక్కడ గంగానదిలో మొత్తం పట్టణములోని చెత్త, మురికి అంతా వచ్చి కలుస్తూ ఉంటుంది. బొంబాయిలోని చెత్త అంతా సముద్రంలో కలుస్తుంది.

భక్తిలో మీరు పెద్ద-పెద్ద మందిరాలు నిర్మిస్తారు. వజ్ర వైఢూర్యాలతో సుఖముంటుంది కదా! 3/4 భాగము సుఖము, మిగిలిన పాతిక భాగము దు:ఖము. అర్ధము-అర్ధము(సగము-సగము) అయితే మజా ఉండదు. భక్తిమార్గంలో కూడా మీరు చాలా సుఖంగా ఉంటారు. ఆ తర్వాత మందిరాలు మొదలైనవాటిని దోచుకుంటారు. సత్యయుగములో మీరు ఎంతో ధనవంతులుగా ఉండేవారు. పిల్లలైన మీకు చాలా సంతోషముండాలి. లక్ష్యమైతే మీ ముందే నిల్చొని ఉంది. తల్లిదండ్రుల పదవి అయితే నిశ్చయింపబడింది. ఖుషీ వంటి బలమైన ఆహారమేదీ లేదని గాయనముంది. యోగము ద్వారా ఆయువు పెరుగుతుంది.

ఇప్పుడు 84 జన్మల చక్రములో తిరుగుతామని ఆత్మకు స్వ దర్శనమయింది. ఇంత పాత్రను చేస్తుంది. పాత్రధారులైన ఆత్మలన్నీ క్రిందికి వచ్చినప్పుడు తండ్రి అందరినీ తీసుకెళ్తారు. శివుని పెళ్ళి మెరవణి(ఊరేగింపు) అని అంటారు కదా. ఈ విషయాలన్నీ మీకు నంబరువారు పురుషార్థానుసారము తెలుసు. ఎంత స్మృతిలో ఉంటారో, అంత ఖుషీగా ఉంటారు. రోజులు గడచిన కొలది అనుభవము చేస్తూ ఉంటారు, ఎందుకంటే నేర్పించేవారు ఆ తండ్రి కదా. ఇతను(బ్రహ్మ) కూడా నేర్పిస్తూ ఉంటారు. బ్రహ్మను అడిగే అవసరముండదు. మీరు అడుగుతారు. ఇతను కూడా వింటారు కాని జవాబిచ్చేది తండ్రి. ఇతను కూడా వింటారు. ఇతని పాత్ర చాలా అద్భుతము. ఇతను కూడా నన్ను స్మృతి చేస్తారు. నేను చెప్పింది విని పిల్లలకు వివరించి వినిపిస్తారు. బాబా నాకు తినిపిస్తారు, నేను వారికి నా రథమునిస్తాను. అందులో సవారీ చేస్తారు. కనుక నాకు ఎందుకు తినిపించరు? ఇది మానవ అశ్వము. నేను శివబాబా రథమును. ఇది గుర్తుండినా శివబాబా గుర్తుంటారు. స్మృతి ద్వారానే లాభముంటుంది. భండారములో భోజనము తయారుచేసినా శివబాబా పిల్లల కొరకు తయారు చేస్తున్నానని భావించండి. మీరు కూడా శివబాబా సంతానమే. ఇలా స్మృతి చేసినా లాభమే లాభము.

ఎవరైతే స్మృతిలో ఉండి కర్మాతీత అవస్థను పొంది సేవ కూడా చేస్తారో, వారికి అందరికంటే గొప్ప పదవి లభిస్తుంది. ఈ బాబా కూడా చాలా సర్వీసు చేస్తారు కదా. ఇతనిది అనంతమైన సర్వీసు, మీరు హద్దు సర్వీసు చేస్తారు. సర్వీసు వల్లనే ఇతనికి కూడా పదవి లభిస్తుంది. ఇలా, ఇలా చేయమని శివబాబా ఇతనికి కూడా సలహా ఇస్తారు. పిల్లలకు తుఫానులేమో వస్తాయి. స్మృతి చేయకుంటే కర్మేంద్రియాలు వశమవ్వడం చాలా కష్టము. స్మృతి ద్వారానే నావ ఆవలి తీరానికి చేరాలి. ఇది శివబాబా చెప్తున్నారా, బ్రహ్మాబాబా చెప్తున్నారా అని అర్థము చేసుకోవడం కూడా కష్టమవుతుంది. దీని కొరకు చాలా సూక్ష్మ బుద్ధి కావాలి. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ఈ సమయంలో పూర్తి మరజీవాగా అవ్వాలి. చదువు బాగా చదువుకోవాలి. మీ చార్టు లేక రిజిస్టరును ఉంచాలి. స్మృతిలో ఉంటూ మీ కర్మాతీత స్థితిని తయారుచేసుకోవాలి.
2. అంతిమ వినాశ దృశ్యము చూచేందుకు ధైర్యశాలురుగా అవ్వాలి. నేను ఆత్మను అను అభ్యాసము ద్వారా దేహ భావము నశిస్తూ పోవాలి.

## వరదానము :- " ఏ భయంకర సమస్యనైనా శీతలంగా చేసే సంపూర్ణ నిశ్చయబుద్ధి భవ "

ఎలాగైతే తండ్రిలో నిశ్చయముందో అలా స్వయంలో, డ్రామాలో కూడా సంపూర్ణ నిశ్చయముండాలి. ఒకవేళ స్వయంలో బలహీన సంకల్పాలు ఉత్పన్నమవుతే బలహీన సంస్కారము తయారవుతుంది. అందువలన వ్యర్థ సంకల్పాలనే బలహీన కీటాణువులను(జర్మ్సను) మీలో ప్రవేశించనీయరాదు. దానితో పాటు డ్రామాలో ఏ దృశ్యము చూచినా, ఆందోళన కలిగించే దృశ్యములో కూడా కళ్యాణము అనుభవమవ్వాలి, వాతావరణము కదిలించేదిగా ఉన్నా, సమస్య భయంకరమైనదిగా ఉన్నా సదా నిశ్చయబుద్ధితో విజయులుగా అయితే భయంకరమైన సమస్య కూడా శీతలంగా అవుతుంది.

## స్లోగన్ :- " ఎవరికైతే తండ్రి మరియు సేవ పైప్రేమ ఉంటుందో, వారికి స్వతహాగానే పరివారం ప్రేమ లభిస్తుంది. "